TGTEL/25/A4812


వాయిస్ ఆఫ్

# వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 53 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | జూన్ 04, 2026



2లో..

## కేరళను తాకిన నైరుతి

## రుతుపవనాలు..

- వారం రోజుల్లో తెలంగాణకు రాక!
- ఎల్‌నినో ప్రభావంతో ఈసారి కొంత ఆలస్యం
- కేరళలో భారీ వర్షాలు..
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

## కొడంగల్ ఎత్తిపోతలతో

# లక్ష ఎకరాలకు సాగునీరు



- సీఎం రేవంత్ రెడ్డి
- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పరిశీలన
- పంప్ హౌస్ కాంక్రీట్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- బెంగళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకున్న సీఎం బృందం
- కలెక్టర్ ఘన స్వాగతం

**నారాయణపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మక్తల్ – నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భీమా, కృష్ణా నదులపై నిర్మించనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనుల పురోగతిని ముఖ్యమంత్రి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బెంగళూరు పర్యటన ముగించుకుని నేరుగా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులకు జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు.

(మిగతా వివరాలు 2వ పేజీలో ..)

## ఖరీఫ్ సీజన్ నుంచైనా 'రైతు భరోసా' అమలు చేయాలి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- వ్యవసాయంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదు
- రైతులకు 50 శాతం రాయితీతో సోలార్ ఫెన్సింగ్ ఇవ్వాలని డిమాండ్



2లో..

**జగిత్యాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నా, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయంపై ఎలాంటి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి డాక్టర్ టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాల మాఫీ, కొత్త రుణాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించలేదని జీవన్ రెడ్డి విమర్శించారు. కనీసం రాబోయే ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా నిధులను సకాలంలో కల్పించాలని డిమాండ్ చేశారు.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఎగసిపడిన మంటలు
- మెట్రో పిల్లర్ 1043 సమీపంలో ఘటన
- అమీర్‌పేట – ఎస్సార్ నగర్ మధ్య నిలిచిపోయిన ట్రాఫిక్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్‌లోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లోని మెట్రో పిల్లర్ నంబర్ 1043 సమీపంలో గల 'కేఎస్సార్ ఫ్యాషన్స్' దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు భవనం అంతటా వ్యాపించి, దట్టమైన పొగ కమ్మేయడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. మంటలు పక్కనే ఉన్న ఇతర వాణిజ్య సముదాయాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రమాద సమయంలో భవనంలో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తరలించారు.

( మిగతా వివరాలు 2 వ పేజీలో..)

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై నిఘా

- సుప్రీంకోర్టు ప్రత్యేక దృష్టి
- చిన్నారుల అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు
- సమగ్ర మార్గదర్శకాలపై స్పందన తెలపాలని కేంద్రానికి ఆదేశం
- తదుపరి విచారణ ఆగస్టు 19కి వాయిదా



2లో..

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలో పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు.. సరోగసీ , ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ వ్యవస్థల ద్వారా చిన్నారుల అక్రమ రవాణా జరగకుండా అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ సుప్రీంకోర్టుకు పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం దేశంలో సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, అవి కేవలం వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 04, 2026

## ఖరీఫ్ సీజన్ నుంచైనా 'రైతు భరోసా' అమలు చేయాలి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- వ్యవసాయంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదు
- రైతులకు 50 శాతం రాయితీతో సోలార్ ఫెన్సింగ్ ఇవ్వాలని డిమాండ్

(**మొదటి పేజీ తర్వాత..** ) సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఇప్పటివరకు సాగిన పంట కాలాల్లో ఎంతమంది రైతులకు భరోసా దక్కిందో ప్రభుత్వం ఆలోచించుకోవాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకరిపై ఒకరు రాజకీయ ఆరోపణలు చేసుకుంటూ రైతులను నట్టేట ముంచుతున్నాయని మండిపడ్డారు. మార్కెట్లో పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహాలు ఇస్తున్న ప్రభుత్వం.. వాటి సాగుకు రైతులకు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తుందో స్పష్టం చేయాలి. పంటలను నాశనం చేస్తున్న కోతుల బెడద నుంచి ఉపశమనం కలిగించేందుకు జిల్లాకు ఒకటి చొప్పున 'కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రం' ఏర్పాటు చేయాలి. వన్యప్రాణుల నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులకు 50 శాతం రాయితీతో సోలార్ ఫెన్సింగ్ సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం మార్కెట్లో యూరియా కొరత వేధిస్తోందని, తక్షణమే 'యూరియా యాప్' విధానాన్ని తొలగించి, సొసైటీల ద్వారా నేరుగా రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, రైతాంగాన్ని ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఎగసిపడిన మంటలు
- మెట్రో పిల్లర్ 1043 సమీపంలో ఘటన
- అమీర్‌పేట – ఎస్సార్ నగర్ మధ్య నిలిచిపోయిన ట్రాఫిక్

(**మొదటి పేజీ తర్వాత..** ) ఈ అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అమీర్‌పేట – ఎస్సార్‌నగర్ మార్గంలో వాహనాలను ఇతర వీధుల్లోకి మళ్లిస్తున్నారు. వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకుని, ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్లాలని, అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు.

## కొడంగల్ ఎత్తిపోతలతో
# లక్ష ఎకరాలకు సాగునీరు



- సీఎం రేవంత్ రెడ్డి
- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పరిశీలన
- పంప్ హౌస్ కాంక్రీట్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- బెంగళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకున్న సీఎం బృందం
- కలెక్టర్ ఘన స్వాగతం

(**మొదటి పేజీ తర్వాత..** ) ప్రతిపాదిత బ్యారేజీ పనుల పురోగతి, డిజైన్లు, ప్లాన్ మ్యాప్‌లను ఇరిగేషన్ ఉన్నతాధికారులు సీఎంకు సమగ్రంగా వివరించారు. అనంతరం మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న 'కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజీ–1' పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ప్యాకేజీ–1 లో భాగంగా నిర్మిస్తున్న పంప్ హౌస్ పనులు ఇప్పటివరకు ఎంత శాతం పూర్తయ్యాయనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లో ఆలస్యం జరగకూడదని, తక్షణమే కాంక్రీటు పనులను ప్రారంభించి పనుల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి (నీటి పారుదల శాఖ), దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కర్ణాటక ప్రతినిధులు కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ ఏ. సత్యనారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి. శ్రీధర్ పాల్గొన్నారు.





## కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు..

- వారం రోజుల్లో తెలంగాణకు రాక!
- ఎల్‌నినో ప్రభావంతో ఈసారి కొంత ఆలస్యం
- కేరళలో భారీ వర్షాలు..
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

**తిరువనంతపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఇంతకాలం మండుటెండలు, తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళ తీరాన్ని తాకాయి. వీటి ప్రభావంతో కేరళ తీర ప్రాంతాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక్కడి నుంచి ఇవి క్రమంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు విస్తరించి.. మరో వారంలోపే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. వాస్తవానికి ఈ ఏడాది మే 26నే రుతుపవనాలు కేరళను తాకుతాయని ఐఎండీ ముందుగా అంచనా వేసింది. కానీ, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్‌నినో' ప్రభావం వల్ల వాతావరణ అంచనాలు తలకిందులై, రుతుపవనాల రాక కొంత ఆలస్యమైంది. జూన్ నెలలో ఈ ఎల్‌నినో పరిస్థితులు బలహీనంగా ఉన్నప్పటికీ, సెప్టెంబర్ నాటికి ఇవి మరింత బలపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రుతుపవనాల రాకతో కేరళలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. అటు తమిళనాడులోనూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కేరళ అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ. తమిళనాడులో రానున్న కొన్ని గంటల్లో 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం. తెలంగాణలో వారం రోజుల్లోగా రాష్ట్రంలోకి ప్రవేశించే అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది రుతుపవనాల కాలంలో (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీర్ఘకాల సగటు తో పోలిస్తే ఈ సీజన్‌లో కేవలం 90 శాతం మేరకే వర్షపాతం కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. ఏదేమైనా రుతుపవనాల ప్రవేశంతో దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత తగ్గి, ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి.

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల
# నియంత్రణపై నిఘా

- సుప్రీంకోర్టు ప్రత్యేక దృష్టి
- చిన్నారుల అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు
- సమగ్ర మార్గదర్శకాలపై స్పందన తెలపాలని కేంద్రానికి ఆదేశం
- తదుపరి విచారణ ఆగస్టు 19కి వాయిదా

(**మొదటి పేజీ తర్వాత..** ) చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేకమైన ప్రామాణిక కార్యాచరణ విధానంలేదా ప్రోటోకాల్ ప్రస్తుత చట్టాల్లో లేదని వివరించారు. ఈ నేపథ్యంలో సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు, లోపాలను సవరించేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక 'ప్రత్యేక కమిటీ'ని ఏర్పాటు చేయాలని అమికస్ క్యూరీ ప్రతిపాదించారు. ఆ కమిటీ ఇచ్చే సూచనల ఆధారంగా మానవ అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకునేలా ఒక సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించాలని కోరారు. అమికస్ క్యూరీ చేసిన ఈ ప్రతిపాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. ఈ సున్నితమైన అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, తన పూర్తిస్థాయి అభిప్రాయాన్ని న్యాయస్థానానికి తెలియజేయాలని ఆదేశించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, జూన్ 04, 2026

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జ్యోతినాయక్ తండా గ్రామసభలో సర్పంచ్ కృష్ణవేణి
- ప్రజా పాలన – ప్రగతి పాలన సభ
- గ్రామాభివృద్ధి, లబ్ధిదారుల ఎంపికే ప్రధాన ఎజెండా



**పదర, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి పాలన' 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, పదర మండలం జ్యోతి నాయక్ తండా గ్రామపంచాయతీలో గురువారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రత్లవత్ కృష్ణవేణి సాయిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రధాన ఎజెండాగా పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రత్లావత్ కృష్ణవేణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులందరికీ చేరాలనే ఉద్దేశంతోనే ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల మేలు కోసమేనని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని, సాధించిన ప్రగతిని ఆమె ప్రజలకు వివరించారు. గ్రామసభకు హాజరైన తండా ప్రజల నుంచి స్థానిక సమస్యలను, వినతులను అధికారులు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, అంతర్గత రోడ్లు, విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సభలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ఈ 'ప్రజా పాలన' వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు, అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక గ్రామసభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారిలతో పాటు మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, ఆరోగ్య, విద్యుత్ శాఖల సిబ్బంది, తండా యువకులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భావి తరాలకు పచ్చదనమే ఆయువుపట్టు

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి
- కేయూలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



**కేయూ క్యాంపస్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** విశ్వ మానవ మనుగడకు పర్యావరణ సమతుల్యత అత్యంత అవసరమని, భావితరాలకు పచ్చదనమే ఆయువుపట్టుగా నిలుస్తుందని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం – 2026 సందర్భంగా కేయూ వైస్ ఛాన్సలర్ కార్యాలయంలో 'ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ' ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పర్యవేక్షణలో రూపొందించిన పర్యావరణ అవగాహన పోస్టర్‌ను, అలాగే మొక్కల సంరక్షణ ప్రాధాన్యతను వివరించే ప్రతిజ్ఞా ప్రమాణ పత్రాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం విసి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న పర్యావరణ సంక్షోభాలకు పచ్చని చెట్లను పెంచడమే ఏకైక పరిష్కార మార్గమన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రహదారుల వెంట, వీధి వీధిలో, వాడవాడలా, ఇంటింటా పచ్చదనం విరిసిసిలేలా ఈ మహాయజ్ఞం కొనసాగాలన్నారు. అంతర్జాతీయ సంస్థల పిలుపు అయిన "క్లైమేట్ యాక్షన్ బిగిన్స్ విత్ యూ" అనే లక్ష్యాన్ని మన నుంచే ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం చింతగట్టు కెనాల్ గట్టు పొడవునా ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకుంటామని ఈ సందర్భంగా వారు ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ కార్యక్రమానికి సహకరించిన వీసీ ప్రతాపరెడ్డికి సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వి.రామచందర్, ఓఎస్డీ ప్రసాద్, బి.వెంకటరామిరెడ్డి, ప్రొఫెసర్ నారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అనగంటి శ్రీకాంత్, తాళ్లపల్లి రామస్వామి గౌడ్, అనగంటి రాజేష్, బోనగాని యాదగిరి గౌడ్, గాజుల సంపత్, గుండేటి చక్రపాణి, దాసరి వినయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాచకులకు గొడుగుల పంపిణీ



**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తీవ్రమైన ఎండల నేపథ్యంలో పేదలు, యాచకులను ఆదుకునేందుకు అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 192 ఆధ్వర్యంలో వరంగల్ భద్రకాళి దేవస్థాన ఆవరణలో యాచకులకు గొడుగులను పంపిణీ చేశారు. అలయన్స్ క్లబ్స్ మల్టిపుల్ కోఆర్డినేటర్ ఆలయ్ గజ్జెల ఓంకార్ లింగం శాస్త్రి ఆధ్వర్యంలో గురువారం ఈ వినూత్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అలయన్స్ క్లబ్స్ మాజీ గవర్నర్ ఆలయ్ చిప్ప వెంకటేశ్వర్లు నేత మాట్లాడుతూ.. సొంత కుటుంబ సభ్యులనే ఆదరించని ప్రస్తుత రోజుల్లో పేదలు, బడుగు బలహీన వర్గాలు, వృద్ధులు, అనాథలకు నిరంతరం సేవ చేయడంలో వరంగల్ అలయన్స్ క్లబ్ సభ్యులు ముందుండడం ఎంతో అభినందనీయమన్నారు. తీవ్రమైన ఎండ తీవ్రతను కూడా లెక్కచేయకుండా ఆలయ పరిసరాల్లో యాచకులు భిక్షాటన చేస్తున్న దృశ్యాన్ని చూసి చలించిపోయిన గజ్జెల ఓంకార్.. వారికి తక్షణ ఉపశమనం కోసం గొడుగులు పంపిణీ చేయాలని సంకల్పించడం గొప్ప విషయమని చిప్ప వెంకటేశ్వర్లు కొనియాడారు. ఈ సద్గుణ కార్యం కోసం తమను భాగస్వామ్యం చేసినందుకు నిర్వాహకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా యాచకులు, పేదలు వడదెబ్బకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మానవతా కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ వరంగల్ 192 గవర్నర్ ఆలయ్ పెంట కుమార్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఆలయ్ దస్తగిరి, ట్రెజరర్ దోమల నాగేందర్, వరంగల్ క్లబ్ ప్రెసిడెంట్ ఆలయ్ ఎలుగం వెంకటమల్లు, వైస్ ప్రెసిడెంట్ ఆలయ్ ఎలిగేటి శ్రీనివాస్, ఆలయ్ సిరికొండ శ్రీనివాసచారి, క్లబ్ ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# బాధితుడి కుటుంబానికి పరామర్శ

**గణపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల పరిధిలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మొగిలి పెద్ద ఐలయ్య కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డి గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చిన ఆమె, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఐలయ్య అకాల మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్ రావు, వడ్డెం రాజశేఖర్, మొగిలి మనోహర్, గాదె మనోహర్, జక్కుల మహేష్, జక్కుల సందీప్, మొగిలి అనిల్, ఎర్ర రాకేష్ రెడ్డితో పాటు స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను తక్షణమే ఆదుకోవాలి

- అమరుల కుటుంబాలకు ఇళ్లు, ఉద్యోగాలు కల్పించాలి
- కేసులన్నీ బేషరతుగా ఎత్తివేయాలి
- సీపీఐ నేతలు శ్రీనివాసరావు, ఈటీ నర్సింహా



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలను, సుదీర్ఘంగా పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటీ నర్సింహా డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర సెక్రటేరియట్‌లో 'తెలంగాణ ఉద్యమకారుల కమిటీ' ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున వారు పాల్గొని మాట్లాడారు. మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన సీపీఐ, ఉద్యమకారుల ఆకాంక్షలను, వారి కుటుంబాల రక్షణను కాపాడటం కోసం కమిటీ ముందు పలు కీలక ప్రతిపాదనలను ఉంచిందని వారు వెల్లడించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగంతో పాటు తగిన ఆర్థిక సాయం అందించాలి. ఇప్పటివరకు ప్రభుత్వ సాయం అందని మిగిలిన కుటుంబాలను వెంటనే గుర్తించి ఆదుకోవాలి. ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువకులు, ఇతర ఉద్యమకారులపై నమోదైన అన్ని రకాల పోలీస్ కేసులను ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ఎత్తివేయాలి. వయసు పైబడిన, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఉద్యమకారులకు నెలవారీ గౌరవ వేతనం (పెన్షన్) అందించాలి. వారి కుటుంబ సభ్యులందరికీ ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం కోసం ప్రత్యేక హెల్త్ కార్డులు జారీ చేయాలి. కమ్యూనిస్టులు, ఇతర సామాజిక శక్తులు చేసిన సాయుధ పోరాటాలు, మలిదశ ఉద్యమ అసలు సిసలైన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి. గన్‌పార్క్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో అమరవీరుల స్మారక చిహ్నాలను నిర్మించాలి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి ఒకటిన్నర దశాబ్దం కావస్తున్నా.. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు 'సామాజిక సమానత్వం' అనే ప్రధాన ఉద్యమ ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని సీపీఐ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన ఉద్యమకారులను గౌరవించుకోవడం అంటే ఆనాటి ఆకాంక్షల సాధన కోసం చిత్తశుద్ధితో పనిచేయడమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం నియమించిన 'ఉద్యమకారుల కమిటీ' కేవలం నామమాత్రంగా మిగిలిపోకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల నుంచి నేరుగా వినతులు స్వీకరించాలని, త్వరితగతిన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని వారు డిమాండ్ చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 04, 2026

# వెల్టూర్ నూతన పంచాయతీ కార్యదర్శికి ఘన స్వాగతం



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండలంలోని వెల్టూర్ గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన మూడవతు బొజ్జికి స్థానిక సర్పంచ్ చింతోజ్ వెంకటేష్ ఘనంగా స్వాగతం పలికారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి విచ్చేసిన ఆమెకు సర్పంచ్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఈమె అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సేవలందించారు. బదిలీల ప్రక్రియలో భాగంగా అక్కడ నుండి వెల్టూర్ గ్రామానికి రావడం జరిగింది. కాగా, ఇప్పటివరకు వెల్టూర్‌లో విధులు నిర్వహించిన పూర్వ కార్యదర్శి ఉమాశంకర్ నడింపల్లి గ్రామానికి బదిలీ అయినట్లు సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పరి మల్లేష్, వార్డు సభ్యులు బూరం నరేష్ యాదవ్, సుంకరి మౌనిక నాగరాజు, గుద్దటి పార్వతమ్మ (బాలరాజు), మాజీ వార్డు సభ్యులు గజ్జె జానయ్య, వెంకటేష్ చారి పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది నిరంజన్, లక్ష్మమ్మ, సైదులు, లాలూ గౌడ్, నాగార్జున, ఖాదర్ పాల్గొన్నారు.

# కర్ణాటకలో 'వేములవాడ పాలకవర్గం' పర్యటన

- ఆధునిక మార్కెటింగ్ విధానాల పరిశీలన
- సిద్ధనూరు జనతాగంజ్ మార్కెట్ యార్డును సందర్శించిన కమిటీ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రైతులకు ఆధునిక మార్కెటింగ్ విధానాలను పరిచయం చేయడంతో పాటు, మార్కెట్ నిర్వహణలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కర్ణాటక రాష్ట్రంలో తాము అధ్యయన పర్యటన చేపట్టినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా గురువారం కర్ణాటక రాష్ట్రంలోని సిద్ధనూరు నియోజకవర్గ పరిధిలో గల ప్రసిద్ధ 'జనతాగంజ్ మార్కెట్ యార్డు'ను వేములవాడ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, డైరెక్టర్లు ప్రతినిధి బృందంగా సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ.. సిద్ధనూరు మార్కెట్ యార్డులోని మౌలిక వసతులు, డిజిటల్ పద్ధతుల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు–అమ్మకాల ప్రక్రియ, రైతులకు కల్పిస్తున్న విశ్రాంతి వసతులు, గోదాముల అధునాతన నిర్వహణ, పారదర్శక మార్కెటింగ్ విధానాలను తాము నిశితంగా పరిశీలించినట్లు వెల్లడించారు. అక్కడి మార్కెట్ యార్డు ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై, వారు అమలు చేస్తున్న వ్యూహాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక మార్కెట్లలో అమలవుతున్న ఉత్తమ, విజయవంతమైన పద్ధతులను అధ్యయనం చేసి, వాటిని వేములవాడ మార్కెట్ యార్డులో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. తద్వారా మన ప్రాంత రైతులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించడంతో పాటు మార్కెట్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడానికి ఈ పర్యటన ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ అధ్యయన పర్యటనలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కత్తి కనకయ్య, పాలకుర్తి పరశురాము, ఖమ్మం గణేష్, మానుపాటి పరుశురాములు, చెరుకు శంకర్లతో పాటు వేములవాడ ప్రాంతానికి చెందిన పలువురు ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు.

# కబడ్డీ వేసవి శిక్షణ శిబిరంలో పండ్ల పంపిణీ



**అచ్చంపేట/లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గత 41 రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ వేసవి శిక్షణ శిబిరాన్ని మాజీ వార్డు సభ్యులు కొత్త రామకృష్ణ సందర్శించారు. సామాజిక సేవ చేయాలనే సదుద్దేశంతో, క్రీడల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించడానికి ఆయన శిబిరంలోని క్రీడాకారులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రామకృష్ణ మాట్లాడుతూ.. క్రీడాకారులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, శిక్షకులు నేర్పించే మెళకువలను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. నిరంతర సాధన, పట్టుదల, క్రీడా స్ఫూర్తితోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఇక్కడి క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీల్లో రాణించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా గత 41 రోజులుగా యువ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న కబడ్డీ కోచింగ్ క్యాంప్ నిర్వాహకులు, శిక్షకులు ఎం.డి. అబ్దుల్లా, ఉమా, కంప హరీష్, ప్యారం నవీన్‌ల సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రీడా ప్రోత్సాహక కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రాజాలు, వార్డు సభ్యులు రాసమల్ల రమేష్, రాంజీ నాయక్, కార్కొండ తిరుపతయ్య, గోపి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రత్యేక పోలీసుల పనితీరుపై 'ట్రైనీ ఐపీఎస్'ల అధ్యయనం

- మామునూర్ 4వ బెటాలియన్ సందర్శన
- బెటాలియన్ల నిర్మాణం, కమాండ్ కంట్రోల్‌పై ప్రాక్టికల్ శిక్షణ
- వెల్లడించిన కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి



**మామునూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ప్రత్యేక పోలీసుల విధుల నిర్వహణ, అంతర్గత భద్రతా పద్ధతులు మరియు బెటాలియన్ల పనితీరును క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు నలుగురు ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు మామునూర్‌లోని 4వ బెటాలియన్‌ను సందర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన 77 ఆర్ఆర్ (2024 బ్యాచ్)కు చెందిన అయేషా ఫాతిమా, మం.సోహమ్ సునీల్, మనీషా నెహ్రా, రాహుల్ కాంత్ అనే ఐపీఎస్ అధికారులు తమ వారం రోజుల ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా రెండు రోజుల పాటు ఈ యూనిట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా 4వ బెటాలియన్ కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి ఐపీఎస్ ప్రొబేషనర్లతో ప్రత్యేకంగా సమావేశమై.. బెటాలియన్ల నిర్మాణం, కమాండ్ అండ్ కంట్రోల్ విధానం, అత్యవసర సమయాల్లో బలగాల మోహరింపు, సిబ్బంది శిక్షణ, వసతి, సంక్షేమ కార్యక్రమాలు మరియు సిబ్బంది ఫిర్యాదుల పరిష్కార వేదికల గురించి సుదీర్ఘంగా వివరించారు. అసిస్టెంట్ కమాండెంట్ బాలయ్య ఆధ్వర్యంలో ఐపీఎస్ అధికారులు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం పనితీరును, ప్రొవిజనల్ స్టోర్ నిర్వహణను, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాన్ని నిశితంగా పరిశీలించారు. మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసుల విధుల నిర్వహణను అర్థం చేసుకోవడానికి అధికారులు ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 'బి–కంపెనీ'ని సందర్శించారు. అక్కడ సిబ్బంది క్రమశిక్షణ, వసతి, రవాణా సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మామునూర్ పరిధిలోని 'స్పెషల్ పార్టీ పోస్ట్'ను కూడా అధికారులు సందర్శించి క్షేత్రస్థాయి తనిఖీలు మరియు భద్రతా నిఘాపై అవగాహన పెంచుకున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ క్షేత్రస్థాయి శిక్షణా కార్యక్రమంలో 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జె.రాజేందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, బెటాలియన్ ముఖ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'యశోద హాస్పిటల్స్' సరికొత్త రికార్డు

- అధునాతన ఎండోస్కోపీతో జీర్ణవ్యవస్థ, కాలేయ వ్యాధుల చికిత్స
- సర్జరీ లేకుండానే గడ్డల తొలగింపు
- లివర్ ఫెయిల్యూర్ బాధితులకు 'ప్లాస్మా ఎక్స్ఛేంజ్' ద్వారా పునర్జన్మ
- గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి



**సికింద్రాబాద్/ హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జీర్ణవ్యవస్థ, కాలేయం, ప్యాంక్రియాస్ మరియు పిత్తనాళాలకు సంబంధించిన సంక్లిష్ట వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ విభాగం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక సేవలను అందిస్తోందని ప్రముఖ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వైద్య నిపుణులు నరేష్, రాజ్‌కుమార్, స్వరాజ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. పూర్తిస్థాయి సర్జరీల అవసరం లేకుండా, కేవలం ఎండోస్కోపీ ద్వారానే రోగులకు అత్యంత సురక్షితమైన పద్ధతుల్లో చికిత్స అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు ద్వారా ఎండోస్కోపిక్ సబ్‌మ్యూకోసల్ డిసెక్షన్ తో ప్రారంభ దశలో ఉన్న క్యాన్సర్ గడ్డలను సర్జరీ లేకుండానే తొలగించవచ్చు. పెరొరల్ ఎండోస్కోపిక్ మయోటమీతో మింగడానికి ఇబ్బంది పడే రోగులకు ఎండోస్కోపీ ద్వారా ఉపశమనం. యాంటీ–రిఫ్లక్స్ మ్యూకోసెక్టమీతో తీవ్రమైన గ్యాస్, ఎసిడిటీ రిఫ్లక్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం. క్యాప్సూల్ ఎండోస్కోపీ, బెలూన్ ఎంటెరోస్కోపీతో సాధారణ స్కానింగ్‌కు దొరకని చిన్న పేగుల్లోని రక్తస్రావం, పాలిప్స్‌ను గుర్తించవచ్చు. లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రాణాపాయ స్థితిలో ఉన్న లివర్ రోగులకు రక్తాన్ని శుద్ధి చేసి పునర్జన్మ ఇవ్వడం. ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ తో మందులకు లొంగని క్లోస్ట్రిడియోయిడ్స్ ఇన్‌ఫెక్షన్లకు అత్యాధునిక చికిత్స యశోద హస్పిటల్ లో అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. ఫ్యాటీ లివర్, లివర్ సిరోసిస్, ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్, జీర్ణాశయ రక్తస్రావం వంటి సమస్యలతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే నిపుణులను సంప్రదించాలి. అత్యాధునిక సాంకేతికత, బహుళ విభాగాల సమన్వయంతో యశోద హాస్పిటల్స్ రోగులకు ప్రపంచస్థాయి వైద్యసేవలను అందుబాటు ధరల్లోనే అందిస్తోందని డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, రాజ్ కుమార్, స్వరాజ్ పాల్గొన్నారు.